క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణ



నరసన్నపేట: మండల కేంద్రంలోని శాంతా మణి అమ్మవారిని శ్రావణ మాసం మంగళ వారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. 216 నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

145 మంది ఉద్యోగాలకు ఎంపిక



నియామక పత్రాలు అందజేస్తున్న కంపెనీల ప్రతినిధులు

నరసన్నపేట: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. 145 మందిని ఎంపిక చేసి నియామకపత్రాలు అందించారు. జాబ్ మేళాకు 335 మంది హాజరయ్యారు. వివిధ కంపెనీలకు చెందిన హెచ్ఆర్‌లు వచ్చి నిరుద్యోగ యువతీ, యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైనవారు శిక్షణకు సిద్ధంగా ఉండాలన్నారు. జాబ్ మేళాను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ ఉరిటి సాయికుమార్, పద్మావతి విద్యా సంస్థల డైరెక్టర్ సి.హెచ్.దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీ మధు

నరసన్నపేట: ఖరీఫ్ సీజన్‌లోని పంటలను రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలని స్థానిక వ్యవసాయశాఖ ఏడీ మధు అన్నారు. మండలంలోని రావులవలసలో ఈ-క్రాప్ నమోదును మంగళవారం పరిశీలించారు. వీఏఏలు బాధ్యతగా తమ పరిధిలోని పంటలకు ఈ-క్రాప్ చేయాలని, నిర్ణీత సమయంలో పూర్తికావాలని సూచించారు. అవకతవకలకు పాల్పడవద్దని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు వ్యవసాయశాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు. వ్యవసాయాధికారి సూర్యకుమారి ఉన్నారు.

20 మద్యం బాటిళ్ల స్వాధీనం

కొత్తూరు: మండలంలోని పారాపురం గ్రామంలో మునుకోటి శేఖర్ వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అమీర్ ఆలీ తెలిపారు. మంగళవారం సాయంత్రం సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. శేఖర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

ఒకటో ప్లాట్‌ఫామ్‌ను కొనసాగించాలి

పొందూరు: స్థానిక రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం వినియోగిస్తున్న ఒకటో నంబర్ ప్లాట్ ఫామ్‌ను శాశ్వతంగా కొనసాగించాలని స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం, సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు మంగళవారం స్టేషన్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రాన్ని అందించారు. విశాఖ డివిజనల్ మేనేజర్‌కు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లాలని కోరారు. వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు, బాలింతలకు సౌకర్యవంతంగా ఉందన్నారు. విశాఖపట్నం వైపు వెళ్లే పాసింజర్లు, ఎక్స్‌ప్రెస్ రైల్లు ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై మాత్రమే నిలుపుదల చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నాళం పైడిరాజు, పి.ఎస్.ప్రకాశరావు, బలివాడ గోవిందరావు, పి.దివాకర్‌పాత్రో, విజయకుమార్, బి.జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొసమాల గ్రామానికి చెందిన డోల శేఖర్, కృష్ణ ద్విచక్ర వాహనంపై మెళియాపుట్టి వెళ్లారు. తిరిగి కొసమాల వస్తుండగా గ్రామానికి సమీపంలో కుక్కలు అడ్డంగా రావడంతో బైక్ అదుపుతప్పి పడిపోయారు. శేఖర్‌కు కుడికి కాలు విరిగడంతోపాటు తీవ్రగాయాలయ్యాయి. శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కృష్ణకు స్వల్ప గాయాలయ్యాయి.

పాత పంచాయతీ భవనంలో నిర్వహిస్తున్న మెట్టూరు పీహెచ్‌సీ



ఇదీ ఆస్పత్రేనా..!

- పక్కా భవనం లేని మెట్టూరు పీహెచ్‌సీ
- పాత పంచాయతీ కార్యాలయంలోనే నిర్వహణ
- ఒకే వైద్యుడితో కాలం వెళ్లదీస్తున్న వైనం
- వైద్య సిబ్బంది కొరతతో రోగులకు అందని వైద్యం



నేలపై నిల్వ చేసిన విలువైన మందులు

కొత్తూరు: ప్రజారోగ్యమే లక్ష్యమని చెబుతున్న కూటమి నాయకుల మాటలకు, క్షేత్ర స్థాయిలో పరిస్థితులకు పొంతన ఉండటం లేదు. కొత్తూరు మండలంలోని మెట్టూరులో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022లో పీహెచ్‌సీని మంజూరు చేసింది. వెంటనే మెట్టూరులోని పాత పంచాయతీ కార్యాలయంలో వైద్య సేవలు కూడా ప్రారంభించారు. పీహెచ్‌సీ మంజూరైన వెంటనే నిధులు కూడా గత ప్రభుత్వం కేటాయించింది. పనుల కోసం టెండర్లను కూడా పిలిచింది. భూ వివాదం కోర్టులో ఉన్నందున పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. ఈలోగా సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పీహెచ్‌సీ భవనం నిర్మాణం కోసం మరోచోటైనా స్థలం కేటాయించి, భవనం చేపట్టాలన్న ఆలోచన ఇంతవరకు చేయకపోవడం విచారకరం.

ఇదీ పరిస్థితి..

పీహెచ్‌సీ పరిధిలోని 14 గ్రామ సచివాలయాల్లో గల సుమారు 30 వేల మంది ఉన్నారు. పీహెచ్‌సీ నిర్వహిస్తున్న పంచాయతీ భవనానికి కనీసం మరుగుదొడ్లు లేవు. రోగులు ఉండడానికి మంచాలు లేవు. ఇంజక్షన్ వేయడానికి కనీసం స్టూల్ కూడా లేదు. విలువైన మందులు నిల్వ చేసేందుకు ప్రత్యేక గది, బీరువాలు లేకపోవడంతో నేలపైనే ఉంచాల్సిన పరిస్థితి. రోగులకు రక్త పరీక్షలు చేసేందుకు ల్యాబ్, అవసరమైన పరికరాలు, వీటికి సంబంధించిన రసాయనాలు కూడా లేవు.

భర్తీకాని పోస్టులు..

ఆస్పత్రికి రెండు వైద్య పోస్టులు మంజూరైనప్పటికీ.. ఒక్క వైద్యుడు మాత్రమే ప్రస్తుతం ఉన్నారు. ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు, ఎంపీహెచ్ఎస్ (మేల్), పీహెచ్ఎన్(ఫిమేల్), సూపర్ వైజర్లు, స్వీపర్‌తోపాటు పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రోగులకు సరైన వైద్యం అందకపోవడంతో ఆస్పత్రికి వచ్చేందుకు విముఖత చూపుతున్నారు. కొంత మంది ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. మరికొంత మంది 8 కిలో మీటర్ల దూరంలో ఉన్న కొత్తూరు సీహెచ్‌సీ, హిరమండలం పీహెచ్‌సీలకు వెళ్తున్నారు. మెట్టూరు పీహెచ్‌సీ పరిధిలో గొట్టిపల్లి, లబ్బ, కారిగూడ, అడ్డంగి, ఓంద్రుజోల, ఇరపాడుగూడతోపాటు పలు గిరిజన పంచాయతీలున్నాయి. ఆస్పత్రి భవనం నిర్మించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

భవనం నిర్మించాలి



పీహెచ్‌సీకి పక్కా భవనం తోపాటు ఇతర సౌకర్యాలు కల్పించాలి. వైద్యుడిని, సిబ్బందిని నియమించడం తోపాటు పక్కా భవనం నిర్మించాలి. అప్పుడే పీహెచ్‌సీ ప్రజలకు ఉపయోగపడుతుంది.

– యర్లంకి ధర్మారావు, సర్పంచ్, మెట్టూరు బిట్-2 ఆర్ఆర్ కాలనీ, కొత్తూరు మండలం

వైద్యం అందడం లేదు..



పీహెచ్‌సీకి వైద్యం కోసం వెళ్లినప్పటికీ సిబ్బంది పూర్తి స్థాయిలో లేక వైద్యం అందడం లేదు. చిన్న జబ్బు చేసినా ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది.

– మఠం పూర్ణ, ఎన్‌కేపురం, కొత్తూరు మండలం

ప్రతిపాదనలు పంపించాం

ఆస్పత్రికి పక్కా భవన నిర్మించాలని ఉన్నతాధికారులకు పలుసార్లు ప్రతిపాదనలు పంపించాం. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఆస్పత్రికి వచ్చిన రోగులకు వైద్యం అందివ్వడం జరుగుతుంది. ఒకే వైద్యుడు ఉండటం వలన కొన్ని సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుంది.

– రాంబాబు, వైద్యాధికారి, మెట్టూరు పీహెచ్‌సీ, కొత్తూరు మండలం

శ్రమదానం

సారవకోట మండల కేంద్రంలోని ఊర చెరువు నుంచి పంట పొలాలకు నీరు వెళ్లే కాలువను రైతులు మంగళవారం బాగు చేసుకున్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులతో వరి పంట పొలాలు ఎండిపోతున్నాయి. చెరువులో ఉన్న నీటిని పంట పొలాలకు తరలించేందుకు కాలువలో పేరుకు పోయిన పూడికలను తొలగించారు.

- సారవకోట



చంద్రబాబు మోసాలను ఎండగట్టాలి



బూర్జ: చీడివలసలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

బూర్జ: సీఎం చంద్రబాబు, కూటమి నాయకుల మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మండలంలోని చీడివలస, మామిడివలస, వావాం గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు ఆధ్వర్యంలో మంగళవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చింతాడ రవికుమార్, నాయకులు ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్‌ను అందించారు. జెడ్పీటీసీ బెజ్జిపురం రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కరణం కృష్ణమూర్తినాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, పార్టీ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఎం.కిరణ్ కుమార్, మండల యువజన అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు సురేష్ దొర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలం దబ్బపాడులో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న నాయకులు

ఎల్.ఎన్.పేట మండలంలో..

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలోని దనుకువాడ, దబ్బపాడు గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, మండల ప్రత్యేకాహ్వానితుడు రెడ్డి రామారావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దబ్బపాడు సర్పంచ్ ముద్దాడ మోహిని, పార్టీ నాయకులు ముద్దాడ లక్ష్మణరావు, పల్లి చిరంజీవరావు, మెండ వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులను నులిమేద్దాం

పిల్లల ఆరోగ్యానికి కీడు చేసే నులిపురుగుల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని అధికారులు, వైద్య సిబ్బంది సూచించారు. పిల్లల ఆరోగ్యాన్ని హరించే నులిపురుగుల బారినుంచి వారిని రక్షించాలన్నారు. డీ వార్మింగ్ డేను మంగళవారం నిర్వహించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వైద్య సిబ్బంది వెళ్లి చిన్నారులు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



బూర్జ: బూర్జ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేయిస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఆర్.రామదాసు



సారవకోట: చిన్నకిట్టాలపాడు పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యులు



పాతపట్నం: ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ చంద్రకుమారి



నరసన్నపేట: ఉర్లాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డాక్టర్ శ్రీకాంత్



పోలాకి: కేజీబీవీలో నులిపురుగుల ఆకృతిలో కూర్చున్న విద్యార్థినులు

ఏఓ తీరు సరికాదు



మూడడ్ల రమణ

సరుబుజ్జిలి: రైతుల అవసరాలకు తగిన విధంగా ఎరువులను సరఫరా చేయాల్సిన మండల వ్యవసాయాధికారి మన్మథ రావు పనితీరు సరిగా లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ విమర్శించారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. రొట్టవలస రైతు సేవా కేంద్రంలో నిల్వ చేయాల్సిన ఎరువులను సమీపంలోని ఓ ప్రైవేట్ దుకాణంలో అన్‌లోడ్ చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఎరువులను పంపిణీ చేస్తామని కనీసం రైతులకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. కూటమి నేతలకు కొమ్ముకాస్తూ నచ్చిన వారికే ఎరువులు అందిస్తున్నారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, రైతులు ఎరువుల కోసం ప్రశ్నిస్తే ఏఓ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారన్నారు. ప్రైవేట్ డీలర్లకు మద్దతుగా నిలిచి, అధికార పక్షానికి కొమ్ముకాస్తున్న ఏఓపై జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సచివాలయాల్లో ఖాళీలతో అవస్థలు

సారవకోట: మండలంలోని 20 సచివాలయాల్లో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో ఐదుగురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, నలుగురు ఏఎన్ఎంలు, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, ఒక డిజిటల్ అసిస్టెంట్, పలువురు ఎంఎస్కేలు ఖాళీ అయ్యారు. అన్నుపురం, గోవర్దనపురం పంచాయతీల్లో కార్యదర్శులు లేకపోవడంతో ఇన్‌చార్జ్‌లతో ప్రస్తుతం నెట్టుకొస్తున్నారు. పలు సచివాలయాల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో పనులు సకాలంలో జరగక ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చిన్న, చిన్న సమస్యలు కూడా పరిష్కారం కావడంలేదు. గ్రామాల్లో అపారిశుద్ధ్యం నెలకొంది. ఆయా ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

విద్యార్థులకు అభినందన

మెళియాపుట్టి: మండలంలోని పెద్దలక్ష్మీపురం జిల్లా పరిషత్ పాఠశాలలో 2024-25లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సంపాదించిన చల్ల సుశాంత్, వట్టికుల్ల చాందినిని మంగళవారం అదే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు అభినందించారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని 1984-85 బ్యాచ్ విద్యార్థులు ఆకాంక్షించారు. మొమెంటో, బహుమతులను అందజేశారు. హెచ్ఎం తిరుమల రావు, పాఠశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు బాలకృష్ణ, దుర్యోధన, ఖగేశ్వరరావు, సుందర రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన

మెళియాపుట్టి: వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎరువులు వాడాలని కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యులు అన్నారు. మంగళవారం మండలంలోని మూలనేలబొంతు గిరిజన గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. రిసోర్స్‌పర్సన్ నాగేశ్వరరావు, ఏసీఓ నాగరాజు మాట్లాడుతూ.. వాతావరణంలో వచ్చే మార్పుల వలన, విపత్తుల సమయంలో పంటలను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కాలిబాటలు, సమయానుకూలంగా కషాయాలు, సేంద్రియ ఎరువులు వాడకం వల్ల కలిగే లాభాలను తెలియజేశారు. కూరగాయలు పండించే రైతులకు అధిక దిగుబడులు వచ్చేలా మెలకువలను తెలిజేశారు. సీఓ రంగారావు, మొబలైజర్స్, రైతులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్టలో మంగళవారం జరిగిన జెడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్‌లో టీడీపీ రిగ్గింగ్‌కు పాల్పడిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ గూండాలు పోలింగ్ కేంద్రాల్లో దౌర్జన్యానికి పాల్పడి, వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బలవంతంగా బయటకు నెట్టేశారన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లను అడ్డుకోవడం అన్యాయమన్నారు. సీఎం చంద్రబాబు ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ధ్వజమెత్తారు. ఈ ఎన్నిక కూటమి ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని, పులివెందుల జెడ్పీటీసీ అభ్యర్థిని ఓటు వేయకుండా అడ్డుకోవడం తగదన్నారు. టీడీపీ నాయకులు, పోలీసులు కలిసి కుట్రపన్ని వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా అడ్డుకున్నారన్నారు. టీడీపీకి చెందినవారు మాత్రమే ఓట్లు వేశారన్నారు. ఇంతటి దుర్మార్గమైన ఎన్నికలు గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. బ్యాలెట్ ఓటింగ్‌లోనే ఇంత అరాచకం చేస్తే.. ఈవీఎంలు అయితే మరేంత దారుణంగా వ్యవహరించేవారని అన్నారు. కేవలం పులివెందులలో విజయం సాధించామని చెప్పుకోవడం కోసం అనేక అరాచకాలకు పాల్పడ్డారని ఆరోపించారు.

రైతులను మోసం చేసి సంబరాలా?

- కూటమి పాలనపై వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న ఎంపీపీలు ఆరంగి మురళి,వాన గోపి, నాయకులు

నరసన్నపేట: గడిచిన 15 నెలలుగా రైతులను అన్ని విధాలా మోసం చేసిన కూటమి నాయకులు గ్రామాల్లో సంబరాలు చేసుకోవం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సోమవారం నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో నరసన్నపేట, జలుమూరు ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు, నరసన్నపేట, జలుమూరు మండలాల పార్టీ అధ్యక్షులు లుకలాపు రవి, కణుసు సీతారాం విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా రైతులకు గతేడాదికి చెందిన అన్నదాత సుఖీభవ మొత్తం రూ.20 వేలను ఈ ప్రభుత్వం బకాయి పడిందన్నారు. రెండో ఏడాది బకాయితో కలిపి రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం రూ.5 వేలు ఇచ్చి పండగలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. ఎరువులు లభించక, సాగునీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. రైతులకు ఉచిత బీమా అమలు చేయకుండా, సబ్సిడీపై పనిముట్లు, వడ్డీలేని రుణాలు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, వ్యవసాయ రుణాలు ఇవ్వకుండా సంబరాలు ఎలా చేసుకుంటారని ప్రశ్నించారు. నరసన్నపేటలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో కూటమి నాయకులు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించడాన్ని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల పరిస్థితి దిక్కుతోచని విధంగా మారిందన్నారు. పార్టీ నాయకులు చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, కణితి కృష్ణారావు, సురంగి నర్సింగరావు, రాజాపు అప్పన్న, బగ్గు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

డాగ్స్‌తో డేంజర్



చాపర కూడలిలో సంచరిస్తున్న కుక్కల గుంపు

- చికెన్ వ్యర్థాల కోసం కుక్కల సచారం
- రహదారులపైనే తిష్ట
- మహేంద్రతనయ బ్రిడ్జి మలుపులో కుక్కల బెడదతో నిత్యం ప్రమాదాలు



మెళియాపుట్టిలో కుక్కల గుంపు

మెళియాపుట్టి: మండలంలోని ముఖ్య కూడళ్లు, జన సంచారం ఉన్నచోట కుక్కలు అధికంగా సంచరిస్తుండటంతో వాహనదారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్డుపైకి రావాలంటేనే భయపడుతున్నారు. పగలు మాంసం విక్రయించే షాపుల వద్ద, రాత్రి సమయంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, బజ్జీల దుకాణాల వద్ద గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులు రహదారిపైకి రావాలంటేనే భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మెళియాపుట్టి మండల కేంద్రంతోపాటు, చాపర, గొప్పిలి గ్రామాల్లో సాయంత్రమైతే చాలు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఒక్కోసారి వీటివలన ట్రాఫిక్‌కు కూడా అంతరాయం ఏర్పడుతుంది. మహేంద్రతనయ నదీ సమీపంలో రహదారి పక్కనే చికెన్ వ్యర్థాలు వేయడంతో అధిక మొత్తంలో కుక్కలు అక్కడకి చేరి వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తూ నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కుక్కల నియంత్రణపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బయటికొస్తే భయమేస్తోంది



సాయంత్రం వేళ మార్కెట్‌కు వస్తే ఎక్కడ పడితే అక్కడ సంచరిస్తున్న కుక్కల గుంపులను చూస్తే భయమేస్తుంది. వాహనాలు వెళుతూ ఉన్నా వెంబడిస్తున్నాయి. చిన్న పిల్లలను తీసుకురావాలంటేనే ఏమవుతుందోనని ఆందోళన కలుగుతోంది. మా గ్రామంలో అయితే రాత్రి పూట రహదారిపైకి వెళ్లాలంటే కుక్కల బెడద వెంటాడుతోంది. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలి.

–జీరు రామారావు, మెళియాపుట్టి

చికెన్ వ్యర్థాలు దూరంగా వేయాలి

చికెన్ షాపుల యజమానులకు పిలిపించి మాట్లాడుతాం. కుక్కల సంచారం, ఇతర సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తాం. చికెన్ వ్యర్థాలు గ్రామాలకు దూరంగా వేసేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు ఆదేశిస్తాం.

– తూలుగు తారకేశ్వరి, ఈఓపీఆర్డీ, మెళియాపుట్టి